క్లుప్తంగా

బదిలీ ఈఓపీఆర్డీకి సన్మానం



బదిలీ ఈఓపీఆర్డీ ఈశ్వరయ్యస్వామిని సన్మానిస్తున్న సర్పంచ్‌లు

సి.బెళగల్: మండలంలో ఈఓపీఆర్డీగా పనిచేసి కోసిగి మండలానికి బదిలీ అయిన ఈశ్వరయ్యస్వామిని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాగా మండలంలో పనిచేయడం తనకు సంతృప్తిని ఇచ్చిందని, తన సేవలకు సహకరించిన మండల అధికారులకు, సర్పంచ్‌లకు, పీఎస్‌లకు, సిబ్బంది, ఉద్యోగులు, ప్రజలందరికి బదిలీ ఈఓపీఆర్డీ ధన్యవాదాలు తెలిపారు.

పలుకుదొడ్డిలో గుప్త నిధుల తవ్వకాలు?



గుప్తనిధుల తవ్వకాలు జరిగినట్లు అనుమానిస్తున్న స్థలం

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి గ్రామ శివారులో గుప్త నిధుల తవ్వకాలపై గ్రామస్తులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని శ్రీ బడేఖాన్‌ఖాద్రీ (బడేసావు) దర్గాకు వెళ్లే దారిలో శ్మశానం దగ్గర మట్టి గుట్టను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి అనంతరం తవ్వినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. విషయం శనివారం వార్తా ఛానెళ్లలో, సోషల్ మీడియాలోను వైరల్ అయ్యింది. విషయంపై సి.బెళగల్ ఎస్ఐ పరమేష్‌నాయక్‌ను సంప్రదించగా.. ఘటనపై తమకు సమాచారం, ఫిర్యాదు కాని అందలేదన్నారు. విషయాన్ని తెలుసుకుంటానని తెలిపారు.

ఒప్పంద లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఒప్పంద లెక్చరర్ పోస్టులకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో సివిక్స్ (పౌరశాస్త్ర), హిస్టరీ(చరిత్ర)బోధించుటకు అభ్యర్థులు వచ్చే నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 27వేలు వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలి



ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్యదర్శులు

పాణ్యం: పంచాయతీరాజ్ కార్యదర్శులు తమపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు శనివారం వినతి పత్రం అందించారు. అనంతరం కార్యదర్శులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఉదయం 6గంటలకే ఆయా పంచాయతీలకు వెళ్లాలంటే కష్టమవుతుందని చెప్పారు. కుటుంబాన్ని చూసుకోలేని పరిస్థితి ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు సంతోష్‌కుమార్, సామన్న, శిరిషా, సునీతా, పార్వతిబాయి, వెంకటేశ్వర్లు, విజయకుమారి తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలస్వామి

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తిప్పాయపల్లె గ్రామానికి చెందిన బాలస్వామి(63) అనే వ్యక్తి శుక్రవారం మద్దిలేటయ్య స్వామి దర్శనం కోసం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు హుసేనాపురం రోడ్డుపై దిగాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా కర్నూలు వైపు నుంచి తిరుపతికి వెళుతున్న టెంపో వాహనం బాలస్వామిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తగాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించి, టెంపో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు. ప్రమాదంపై మృతుడి సోదరుడు బాలరంగడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

అన్నదాతకు రిక్తహస్తం!

- ఏడాది గడిచినా పైసా సాయం అందించని కూటమి సర్కారు
- అమలుకు నోచుకోని అన్నదాత సుఖీభవ పథకం
- విత్తనాలు, ఎరువులకు తప్పని పాట్లు
- రాయితీపై అందని స్ప్రేయర్లు
- మొదలైన ఖరీఫ్.. పెట్టుబడి కోసం రైతన్నలు తిప్పలు

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అండగా నిలవాల్సిన సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పైసా సాయం అందించలేదు. ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించి ఇప్పుడు కనీసం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను సైతం రాయితీపై ఇవ్వడం లేదు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమకు విత్తనాలు మొదలు పంట కొనుగోలు వరకు ప్రతి విషయంలో దన్నుగా నిలబడేదని నేడు కూటమి పాలనలో ఆ పరిస్థితి లేదని రైతన్నలు వాపోతున్నారు.



పొలంలో విత్తనం వేస్తున్న రైతు

గడివేముల: పాణ్యం నియోజకవర్గంలో అత్యధిక మంది వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో గడివేముల మండలంలో 22 వేల ఎకరాలు, కల్లూరు పరిధిలో 25 వేల ఎకరాలు, ఓర్వకల్లు పరిధిలో 23 వేల ఎకరాలు, పాణ్యం పరిధిలో 27 వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతాయి. ఆయా మండలాల్లో ఎక్కువగా రైతులు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, మిరప, వరి తదితర పంటలు వేస్తారు. గతేడాది పైసా కూడా పెట్టుబడి సాయం అందించని కూటమి సర్కారు ఈఏడాదైనా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తుందని రైతులు ఆశించారు. అయితే, సీజన్ ప్రారంభమై నెల రోజులైనా అతీగతీ లేదు. దీంతో రైతులు ఇటీవల కురిసిన ముందస్తు వర్షాలకు బయట అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు. పెట్టుబడి సాయం అందించకపోయినా కనీసం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు కూడా పంపిణీ చేయడం లేదని కర్షకులు వాపోతున్నారు. గత సర్కారు ఆర్‌బీకేల ద్వారా వాటిని ఏటా పంపిణీ చేసేదని గుర్తుచేసుకుంటున్నారు. ఎన్నికల ముందు అంతా ఇంతా అని గొప్పులు చెప్పి అధికారంలోకి వచ్చాక రిక్తహస్తం చూపుతుందని కూటమి సర్కారుపై రైతులు పెదవివిరుస్తున్నారు.

వ్యవసాయ పనిముట్ల ఊసే లేదు

గత ప్రభుత్వంలో ప్రతి ఏడాది వ్యవసాయ శాఖ ద్వారా బీసీ రైతులకు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్‌లు రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఈ ఏడాది ఇప్పటివరకు రైతులకు ఉపయోగపడే ఎలాంటి పని ముట్లు ఇవ్వడం లేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో రైతులు వాటిని బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుంది.

నాడు రైతుకు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతే రాజు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రైతులకు అవసరమైన ప్రతీది నాటి జగన్ సర్కారు సమకూర్చేది. పంట సాగుకు రైతులు ఇబ్బంది పడకూడని రైతు భరోసా పథకం కింద ఏటా మూడు విడతల్లో రూ. 13500 సాయం అందించేది.ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రూ. 7500 రైతుల ఖాతాల్లో జమ చేసేది. కూటమి పాలనలో ఇప్పటి వరకు అతీగతీ లేదు. ఎన్నికల ముందు మాత్రం చంద్రబాబు రైతులకు ఏటా రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పటి వరకు అమలు చేయలేదు.

అధిక ధరలకు కొనుగోలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతులకు ప్రతి ఏడాది పంట కాలంలో ఎంతగానో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా కనీసం 50 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేయాలి. గత ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే పరిహారం ఇచ్చేది.

– తలారి చిన్నన్న, రైతు, గడివేముల

ఎన్నికల హామీలు అమలు చేయాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పథకం అమలు కాలేదు. తప్పని పరిస్థితుల్లో మేము పంటల పెట్టుబడులకు బయట అప్పులు చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

–ఉసేన్‌బాషా, గడిగరేవుల

బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండలంలో బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, ఇందుకు ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయులు,సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఎంఆర్‌సీ భవన్‌లో గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో బడి ఈడు వయస్సు పిల్లలు పనికి వెళ్లరాదన్నారు. పిల్లలను తల్లిదండ్రులు రెగ్యులర్‌గా బడికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన ఉసేన్ అలామ్

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు మెట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్లలోని ఫారూక్ నగర్‌కు చెందిన ఉసేన్‌అలమ్ సామాన్ల ట్రాలీ ఆటోలో వ్యాపారం ముగించు కొని బలపనూరు నుంచి రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా తమ్మరాజుపల్లెకు చెందిన టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో ఉసేన్‌అలామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం హైవేపై ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలను తొలగించారు.

కోనా వేంకటేశ్వరుడికి మూడు నెలల సేవ



కొండపై పూజలందుకుంటున్న భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీవారు



క్రిష్ణదొడ్డిలో శ్రీ కోనా వేంకటేశ్వరుడుకి పల్లకోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండలం పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కోనా వేంకటేశ్వర స్వామి వారి ముడు నెలల సేవా కార్యక్రమాన్ని శనివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని కొండపై వెలసిన కోనా వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిసి మూడు నెలలు అవుతున్న సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో చిన్నారుల కోలాటం పలువురను ఆకట్టుకుంది. కాగా కొండపై గ్రామస్తులు, భక్తులు స్వామివారి ప్రసాద వితరణతోపాటు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

ఆసియాన్ అపార్ట్‌మెంట్‌లో చోరీ

- 18 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ



దొంగలు బీరువాను బద్దలు కొట్టిన దృశ్యం

కర్నూలు : నగర శివారులోని కొత్త ఈద్గా సమీపంలో ఉన్న ఆసియాన్ అపార్ట్‌మెంట్‌లో అర్బాస్ ఖాన్ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దండుకుని పరారయ్యారు. ఈయన కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తారు. ఈనెల 24వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో పెళ్లికి వెళ్లారు. ఇదే ఇంట్లోనే అన్న, వదిన కూడా ఉంటారు. 26వ తేదీన వదిన డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లగా ఆమె భర్త ఉద్యోగ రీత్యా ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి గదిలోని వెళ్లి బీరువాలో ఉన్న 18 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. అర్బాస్ ఖాన్ శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలు పులు తెరచిఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువా లోని సామాన్లన్నీ చిందరవందరగా పడివుండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. నాలుగో పట్టణ సీఐ విక్రమ సింహ క్రైం పార్టీ సిబ్బందితో అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సిబ్బందిని రప్పించి ఆధారాలను సేకరించారు. అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ముందు రోజు నుంచి పనిచేయడం లేదని తేలింది. వాచ్‌మెన్ కూడా అపార్ట్‌మెంట్ నిర్వాహకుల అనుమతితో ముందు రోజు పనిమీద వేరే ఊరికి వెళ్లాడు. దీంతో వాచ్‌మెన్ పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అర్బాస్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం



నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

కోడుమూరు రూరల్ : గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ రమేష్‌బాబు శనివారం నిర్వహించిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశంలో వైస్ చైర్మన్ పీఎన్ అస్లామ్, కౌన్సిలర్లు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో కౌన్సిల్ తీర్మానం లేకుండా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టరాదన్నారు. గతంలో మురుగు కాల్వలో పూడికతీత తీయకపోయినా జేసీబీతో తీసినట్లుగా బిల్లును పెట్టారని, మరోసారి ఇలాంటి బిల్లులు పెట్టరాదంటూ అధికారులకు సూచించారు. గూడూరు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కౌన్సిలర్ల ఫోన్లు ఎత్తకుండా, ప్రజలకు సరైన సమాధానం చెప్పకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేయగా.. కమిషనర్ కల్పించుకుని కౌన్సిలర్లకు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. . అనంతరం సభలో ప్రవేశపెట్టిన 5 ప్రతిపాదనలను కౌన్సిలర్లు ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు దస్తగిరి, పద్మావతి, కలామ్‌బాషా, బుడ్డాంగలి, బజారి, కోఆప్షన్ మెంబర్ మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితాలోని భూమి రిజిస్ట్రేషన్

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలోని ఓ భూమి మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ అయింది. ఈ నెల 27వ తేదీన జరిగిన ఈ అక్రమ రిజిస్ట్రేషన్ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు అర్బన్ మండలం మామిదాలపాడు సర్వే నంబర్ 233/3ఏ లో 1.09 ఎకరాల భూమి ఉంది. ఇది ప్రభుత్వ పోరంబోకు భూమి కావడంతో రిజిస్ట్రేషన్ చేయకుండా జిల్లా కలెక్టర్ 2019 ఫిబ్రవరి 27వ తేదీన నిషేధిత జాబితాలో ఉంచారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీన ఈ భూమిని కర్నూలుకు చెందిన సయ్యద్ సాజిద్‌బాషా, కె.ఉమామహేశ్వరరావు అనే వ్యక్తులు కృష్ణగిరి మండలం తొగర్చేడుకు చెందిన బి.జానార్దన్‌నాయుడు అనే వ్యక్తికి చూపుడు ఆయాకం పెట్టారు. అందుకు సంబంధించి కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 5865/2025 గా జూన్ 27వ తేదీన మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ అయింది. కాగా, నిషేధిత జాబితాలో ఉన్న భూమిని ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారో వివరణ కోరడానికి ప్రయత్నిస్తే సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న వరప్రసాదు స్పందించకపోవడం గమనార్హం.



మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ జరిగిన 233/3ఏ సర్వే నంబర్ షెడ్యూల్ వివరాలు

హైకోర్టు జడ్జీలను కలసిన కలెక్టర్, ఎస్పీ

కర్నూలు(సెంట్రల్): అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలుకు వచ్చిన హైకోర్టు జడ్జి జస్టిస్ బీఎస్ భానుమతి, రిటైర్డ్ జడ్జి జస్టిస్ వీఆర్‌కేకే సాగర్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో వారిని కలసి పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని తాజా పరిస్థితులను అధికారులు వారికి వివరించారు.

ఉచితంగా దుప్పట్ల పంపిణీ



ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పుల్లయ్య దంపతులు

ఓర్వకల్లు: మండలంలోని శకునాల గ్రామంలో యోగ గురువులు ఉస్తపల్లె పుల్లయ్యశెట్టి, విజయలక్ష్మి దంపతులు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో హనుమాన్ చాలీసా పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలి



ఉపాధి పథకం కింద సాగైన పండ్లతోటను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శనివారంలోని మండలంలోని ముడుమలగుర్తి, పులకుర్తి గ్రామాల్లో ఏపీఓ ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, ఆయిల్ పామ్, ఆపిల్ బేర్, మునగతో పాటు, మల్లె, గులాబి వంటి పూల తోటలు సాగు చేసుకునేందుకు అవకాశముందన్నారు. ఐదెకరాల్లోపు పొలమున్న చిన్న, సన్నకారు రైతులు ముందుకు రావాలన్నారు. పండ్లతోటలు సాగు చేసుకునే రైతులకు ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా మొక్కలను అందజేయడంతో పాటు, రెండు నుంచి మూడేళ్ల పాటు మొక్కల మెయింటెనెన్స్ కోసం డబ్బు అందజేస్తారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

అదనులోనే పంటలను సాగు చేసుకోవాలి



రైతులకు మినీ విత్తనకిట్లను అందజేస్తున్న ఏఓ రవిప్రకాష్, హెచ్ఓ మదన్‌మోహన్

కోడుమూరు రూరల్ : భారీగా వర్షాలు పడి భూమిలో తేమ ఉన్న సమయంలోనే రైతులు పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. శనివారం మండలంలోని లద్దగిరి గ్రామంలో హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులకు మినీ విత్తనకిట్లను పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ కింద పంటలు సాగు చేసేందుకు సమయంగా ఇంకా చాలా ఉందని, రైతులెవ్వరూ అరకొర వానలకు పంటలు సాగు చేయరాదని సూచించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ముందస్తు వర్షాలకు పత్తి పంట సాగు చేశారని, ప్రస్తుతం పత్తిపంట సాగు చేసి 20నుంచి నెలరోజులైనట్లెతై భూమి ఎరువులను వేసుకోవాలన్నారు. అలాగే పత్తి పంటలో రసం పీల్చే పురుగు, దోమ కనిపిస్తే వేపనూనెను స్ప్రే చేసుకోవాలన్నారు. పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



ఫార్మసీ విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న ప్రొఫెసర్లు

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్‌లాల్ టెక్నాలజీ యూనివర్సిటీ (అనంతపురం) ప్రొఫెసర్లు ఎస్‌వీ సత్యానారాయణ, ఆర్. పద్మ సువర్ణ, ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టభద్రుల మెమొంటోస్ అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రమణ, కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ఆశా కార్యకర్తకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా క్షయ వ్యాధి నివారణ మెడికల్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. శనివారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రకత్వ గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో మూడు టీబీ పాజిటివ్ కేసులు గుర్తించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించిదగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు పటడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. తర్వాత రోగులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. మెరుగైన సేవలు అందించిన ఆశా కార్యకర్త రాణికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు శ్రీధర్‌రెడ్డి, నవీన్‌కుమార్, జెస్సి గ్రేసి, ఎంపీహెచ్ఓ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు నాగరాజు, మద్దమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ స్వర్ణగౌరి, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతా గందరగోళం

- ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్‌లో రాజకీయజోక్యం
- నిబంధనలకు విరుద్ధమంటూ సచివాలయ ఉద్యోగుల నిరసన



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పీఆర్ ఎస్ఈ, ఇంజినీరింగ్ అధికారులు

కర్నూలు (అర్బన్) : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అన్ని కేటగిరీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం చోటు చేసుకుంటోంది. దీంతో అర్హులైన అనేకమంది ఉద్యోగులకు వారు కోరుకున్న స్థానాలు దక్కకపోవడం పట్ల తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి స్థానిక జిల్లాపరిషత్ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి జిల్లాలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 728 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉండగా వీరిలో 477 మంది ఒకే ప్రాంతంలో ఐదు సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. అలాగే రిక్వెస్ట్ బదిలీలు, మెడికల్, స్పౌజ్, డిసేబుల్డ్ చిల్డ్రన్స్ ఉన్నవారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి తొలుత కొంత గందరగోళ పరిస్థితి నెలకొనిందని, ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకు బదిలీలు జరిగినట్లు తమ దృష్టికి రావడంతో ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు అసోసియేషన్ ఆఫ్ సెక్రెటేరియట్ ఇంజినీర్స్ జిల్లా అధ్యక్షులు పి.బాలయ్య తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపడుతున్న విషయాన్ని పంచాయతీ రాజ్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోయామన్నారు. గందరగోళ పరిస్థితిపై ఎస్ఈ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలను కొనసాగిస్తున్నామని చెప్పారు. 5 సంవత్సరాలు పూర్తయిన, స్పెషల్ కేటగిరీ ఉద్యోగుల బదిలీలు పూర్తయ్యాయని, మిగిలిన ఉద్యోగులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.